ఈనాడు అన్నమయ్య

కార్తిక మాసంలో శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు


కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ ప్రాంతీయాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కడపలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నవంబరు 4, 11, 18, 25 తేదీలు (సోమవారాలు)తో పాటు 15న పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. లంకమల, భైరవకోన, నారాయణస్వామి మఠం, సిద్ధేశ్వరమఠం, బి.మఠం పెంచలకోన, శ్రీకాళహస్తి, మహానంది, ఓంకారం, శ్రీశైలం, నాయినాపల్లకోనం, అగస్త్యేశ్వరకోన, పొలతల, నిత్యపూజకోన, అల్లాడుపల్లె దేవళాలు, పుష్పగిరి, కాణిపాకం, కన్యతీర్థం, భానుకోట తదితర శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతామని చెప్పారు. దీపావళి సందర్భంగా 32 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30వ తేదీ ఒక్క బెంగళూరు నుంచే 30 ప్రత్యేక బస్సులు, చెన్నై నుంచి రెండు బస్సులు నడపనున్నామన్నారు. తిరుగు ప్రయాణానికి నవంబరు 3న బెంగళూరుకు 20 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన వెల్లడించారు.

కియోస్క్... సేవలందక మూలకు!

- సాంకేతిక లోపాలతో మొరాయింపు
- అన్నదాతలకు తప్పని ఇబ్బందులు
- ఆర్‌ఎస్‌కేల్లో దిష్టిబొమ్మల్లా దర్శనం

విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా నిలబడాలని సదాశయంతో గత వైకాపా ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు (తాజాగా ఎన్డీయే ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది) ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అవసరమైన రైతులు వచ్చి సిబ్బందికి ముందస్తుగా నగదు చెల్లించాలి. అక్కడ కియోస్క్ యంత్రం ద్వారా ఆన్ లైన్‌లో నమోదు చేస్తే ఆ తరువాత ఎవరికీ ఏ రకం కావాలో తెప్పించే పరిస్థితి ఉండేది. కేంద్రాల్లో అందుబాటులో లేని అంతర్జాలం వసతి, సాంకేతిక లోపాలతో చాలాచోట్ల యంత్రాలు పనిచేయడం లేదు. దిష్టిబొమ్మల్లా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా అన్నదాతలకు సేవలందడంలేదు.

–న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం, గ్రామీణ



ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం రైతు సేవా కేంద్రంలో కొన్ని నెలలుగా పనిచేయని కియోస్క్ యంత్రం

వైఎస్‌ఆర్ జిల్లాలో 432, అన్నమయ్య జిల్లాలో 400 చోట్ల రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కేలు) ఏర్పాటు చేశారు. గత వైకాపా పాలనలో 2020, మే 30న సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. తొలుత ప్రభుత్వ భవనాలు లేని ప్రాంతాల్లో ప్రైవేటు గదులను అద్దెకు తీసుకొని నిర్వహించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలందాయి. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సొంత భవనాలు నిర్మించడానికి అనుమతిచ్చారు. ఒక్కో భవన నిర్మాణానికి తొలుత రూ.17.50 లక్షలు మంజూరు చేశారు. అనంతరం రూ.21.80 లక్షలకు అంచనా పెంచారు. ప్రతి కేంద్రానికి అప్పట్లో కియోస్క్ యంత్ర పరికరాన్ని ఇచ్చారు. ఒక్కోదాని ఖరీదు రూ.80 వేలు నుంచి రూ.90 వేలు వరకు ఉంటుంది. వీటి కోసం రెండు జిల్లాల్లో కలిపి సుమారు రూ.6.65 కోట్లు వెచ్చించారు.

- ఖరీఫ్, రబీలలో కర్షకులు పంటల సాగుకు అవసరమైన విత్తనాలు కావాలంటే ఆర్‌బీకేలకు వచ్చి పేర్లు నమోదు చేసుకుని తన వాటా చెల్లిస్తే తర్వాత తెప్పిస్తున్నారు. ఎరువులకు కూడా ఇదే విధానం అమలవుతోంది. పైర్లను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు సమగ్ర సస్యరక్షణ కోసం పురుగుమందులు పిచికారీ చేయాలి. కాకపోతే వీటిని మాత్రం చాలాచోట్ల విక్రయించలేదు. సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. నాటి సీఎం జగన్ ఏలుబడిలో మరమ్మతులు చేయకుండా వదిలేశారు. బాగు మాటను విస్మరించి పక్కన పెట్టడంతో విలువైన యంత్రాలు అక్కరకు రావడం లేదు. మరో వైపు అంతర్జాలం వసతి కూడా అన్నిచోట్ల అందుబాటులో లేదు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది పలుమార్లు ఏవో, ఏడీఏల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. తమ వద్ద ఉన్న చరవాణితో యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.
- ఒంటిమిట్ట మండలం ఒంటిమిట్ట, నర్వకాటిపల్లె, కొత్తమాధవరం, పెన్న పేరూరు, గంగపేరూరు, రాచగుడిపల్లె, సాలాబాదు, మంటపంపల్లె, చింతరాజుపల్లె కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు పనిచేయకుండా మొరాయిస్తున్నాయి.
- రాజంపేట మండలం మందరం, తాళ్లపాక, మదనగోపాలాపురం, పులపుత్తూరులోనూ పనిచేయడం లేదు. ఇక్కడే కాకుండా రెండు జిల్లాల్లోనూ చాలాచోట్ల ఇదే దుస్థితి నెలకొంది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కియోస్క్ యంత్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

కొన్నిచోట్ల పనిచేయడం లేదు

రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు కొన్నిచోట్ల పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. కర్షకులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వివరాలను ఆర్‌ఎస్‌కే బాధ్యుల చరవాణిలో నమోదు చేయిస్తున్నాం. ఎక్కడైతే వినియోగంలో లేవో క్షేత్రస్థాయి నుంచి సమాచారం సేకరిస్తాం. మరమ్మతులు చేయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బాగు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

- నాగేశ్వరరావు, చంద్రానాయక్, డీఏవోలు, వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాలు

కందిపప్పు వస్తోంది!



- చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు
- పౌరసరఫరాలశాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు

–న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఆర్థికంగా ఊరటనిచ్చేవిధంగా ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ విపణిలో కంది పప్పు ధరలు నింగిని తాకుతున్నాయి. కొనుగోలు చేయాలంటే వామ్మో అంటూ అదిరిపడుతున్నారు. పేదింట పప్పన్నం కరవుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అందరికీ పంపిణీ చేయాలని ఆదేశించింది. లబ్ధిదారులు బియ్యం వద్దనుకుంటే జొన్నలను 1 నుంచి 3 కిలోల వరకు ప్రత్యామ్నాయంగా అందజేయాలని ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ అధికారులు సేకరణపై దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లోని గోదాంలకు సరఫరా చేస్తున్నారు.



ఉచితంగా ఇవ్వనున్న జొన్నలు

- జిల్లాకు 484 మెట్రిక్ టన్నుల కంది పప్పు సరఫరా చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని గోదాంలకు సరఫరా చేస్తున్నారు. డబ్బులు చెల్లించిన రేషన్‌డిపో డీలర్లకు కేటాయించాలని ఉత్తర్వులిచ్చింది. బియ్యం కార్డులున్నవారికి కిలో రూ.67లకు అందించనున్నారు. ఉచితంగా ఇస్తున్న బియ్యానికి బదులు జొన్నలను లబ్ధిదారుల ఐచ్ఛికం మేరకు 1 నుంచి 3 కిలోల వరకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాకు 226 మెట్రిక్ టన్నుల జొన్నలు తెప్పించారు. జొన్నలు కావాలనా, బియ్యం తీసుకోవాలనా అనేది లబ్ధిదారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.
- జిల్లాలో బియ్యం, అంత్యోదయ కార్డులు 5,04,824 ఉన్నాయి. లబ్ధిదారులు 15,13,519 మంది ఉన్నారు. వీరందరికీ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరకులు అందజేయడానికి చౌక ధరల దుకాణాలు 1,123 పనిచేస్తున్నాయి. బహిరంగ విపణిలో రకాన్ని బట్టి కంది పప్పు కిలో రూ.165 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాలు కొనుగోలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క మొన్నటి వరకు గత వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఏ నెలలో కూడా సక్రమంగా పంపిణీ చేసిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రత్యేకంగా దృష్టిసారించింది. సరకులు సరఫరా చేసే గుత్తేదారులకు బకాయిలు చెల్లించడానికి ముందుకొచ్చింది. వచ్చే నెల నుంచి సరకులు తీసుకునే వారందరికీ అందించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలందాయి.

కోటా ప్రకారం సరఫరా

జిల్లాలో రేషన్‌కార్డులున్న లబ్ధిదారులకు కోటా ప్రకారం ఎలాంటి కొరత లేకుండా కంది పప్పు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో కార్డుదారుకు బియ్యానికి బదులు జొన్నలు 1 నుంచి 3 కిలోలు ఉచితంగా ఇచ్చేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. **- శివరామమూర్తి, డీఎం**

విద్యార్థులకు అపార్ జారీకి చర్యలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) యూనిక్ ఐడీ జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహణలో పొరపాట్లకు తావు లేకుండా పటిష్టంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో మేరకు రోస్టర్ కమిటీని నియమించి రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను నిర్ణయించాలన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీఎంబర్స్‌మెంట్‌కు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని, పాత బకాయిల చెల్లింపులపై కసరత్తు చేస్తోందన్నారు. ఒకటో తరగతి పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు అపార్ యూనిక్ ఐడీ జారీకి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని సూచించారు. 'పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు అడుగులు' నినాదంతో నవంబరు 14న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సంయుక్త సమావేశం నిర్వహించాలని, ఇందుకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

భూకేటాయింపుల తాజా స్థితిపై నివేదికలివ్వాలి: జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బదలాయించిన ప్రభుత్వ భూకేటాయింపులకు సంబంధించి తాజా నివేదికలు అందజేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ ఆడిట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఐఐసీ, ఆర్టీసీ, పోలీసు, ఏపీఎండీసీ, పర్యాటక, వైద్య ఆరోగ్య ఇతర విభాగాలకు కేటాయించిన భూములు, వాటి విస్తీర్ణం, ఏ ప్రయోజనం కోసం భూములు ఇచ్చారు, భూములు వినియోగంలో ఉన్నాయా లేదా అనే విషయాలపై సమీక్షించాలని ఆదేశించారు. ఎలాంటి ప్రగతి లేకుంటే అందుకు సంబంధించిన కారణాలపై సంపూర్ణ నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, మదనపల్లె, రాజంపేట సబ్‌కలెక్టర్లు మేఘ స్వరూప్, నైదియాదేవి, ఆర్డీవో రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నీటినిల్వలు తొలగించండి : డీఎంహెచ్‌వో



డ్రమ్ము నీటిలో లార్వాను గుర్తిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య, వైద్య బృందం

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండయ్య పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని ఎస్.ఎన్.కాలనీలో శుక్రవారం నిర్వహించిన దోమ లార్వా నివారణ చర్యలను ఆయన పరిశీలించారు. ప్రతి శుక్రవారం నీటి నిల్వలను తొలగించాలన్నా. నీటి నిల్వ ఉన్న డ్రమ్ములు, కూలర్లు, ఫ్రిజ్‌లు, రోళ్లను పరిశీలించి ప్రజలకు దోమ లార్వా నివారణ చర్యలు తెలియజేశారు. ఆశాల ద్వారా అబాట్ పిచికారీ చేయించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్‌యాదవ్, ఎన్.జయరామయ్య, ఏఎన్ఎం అనూరాధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిల భవనం... భయం భయం

బి.కొత్తకోటలోని యునానీ ఆసుపత్రి భవనం పైకప్పు పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ నెల 23న భవనం పైకప్పు పెచ్చులూడిపడ్డాయి. ఈ సమయంలో ఆసుపత్రి అటెండరుతో పాటు మరొకరు విధులు నిర్వహిస్తున్నారు. అదృష్టవశాత్తు పెచ్చులు పడిన సమయంలో వీరు గదిలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆసుపత్రి భవనం ప్రమాదకరంగా మారడంతో రోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భవనం దెబ్బతింటోంది. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే ఉన్న ఈ భవనానికి వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, బి.కొత్తకోట



కర్ణాటక రాష్ట్రం రాయలపాడు నుంచి పాదయాత్రగా వస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

మదనపల్లె పట్టణం,న్యూస్‌టుడే : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంతవరకు పోరాడతామని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వాల్మీకుల హక్కుల సాధనకు కర్ణాటక వాల్మీకి నవసమాజ సంఘం అధ్యక్షుడు వెంకట్, సంఘం నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండు చేస్తూ కర్ణాటక రాష్ట్రం రాయలపాడు నుంచి శుక్రవారం పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకుల రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని, నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. పాదయాత్ర రాయలపాడు నుంచి చౌడేపల్లె మండలం బోయకొండ గంగమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెదేపా పుంగనూరు నియోజకవర్గ బాధ్యులు చల్లాబాబుకు వినతిపత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు. పాదయాత్రలో శ్రీనివాసపురం తాలూకా అధ్యక్షుడు లక్ష్మినారాయణ, నాయకులు శ్రీనివాసులు, జయసింహ, మంజునాథ్, జగదీశ్, కృష్ణమూర్తి, నిర్మల, సోము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెలిగల్లులో పెరిగిన నీటి నిల్వలు



గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో ఉన్న జలాశయాల్లో సమృద్ధిగా నీటి నిల్వలు పెరగడంతో దిగువన పాపఘ్ని నది ప్రవహిస్తోంది. జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా శుక్రవారం 2.66 టీఎంసీల నీటి మట్టం పెరిగింది. జలాశయం నుంచి గాలివీడు, రాయచోటి రక్షిత నీటి పథకాలకు ఆరు క్యూసెక్కులు, సాగునీటి ఎడమ కాలువకు రెండు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో పది రోజులు కిందట 2.32 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా తుపాను ప్రభావంతో పడిన వర్షాలకు 0.34 టీఎంసీల నీరు అదనంగా చేరింది. నీటి నిల్వను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని జలాశయ డీఈఈ భాస్కర్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణపై హర్షం

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువులో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వచ్చే నెలలో రాష్ట్రస్థాయి అండర్-14 బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెదేపా నాయకుడు జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని గ్యాస్‌గోదాం వెనుక మైదానంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించేందుకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా పాలకులు తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధిని వెనక్కి నెట్టేశారని ధ్వజమెత్తారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఈఓ పురుషోత్తం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత, ఎంఈఓ వెంకటరమణ, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకుడు జయచంద్రారెడ్డి

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

కలకడ, న్యూస్‌టుడే : వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉషశ్రీ సూచించారు. మండలంలోని ఎర్రకోటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రోగ నిరోధక టీకాల రికార్డులు, టీకాలను పరిశీలించారు. అనంతరం టీకాల శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేసి, కార్యక్రమ నిర్వహణ, ప్రణాళికల తయారీ, లబ్ధిదారుల సర్వేకి వివరాల సేకరణ, తదితర వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వైద్యులు కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు, సీహెచ్‌వో నారాయణ, ఎంపీహెచ్‌ఈవో జయరామయ్య, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, సుబ్బరత్న, రెడ్డెమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న వైద్యాధికారిణి ఉషశ్రీ

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు

కలికిరి గ్రామీణ, కలకడ, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సమస్యలు పరిష్కరించేందుకు ఉపవిద్యుత్తు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి గుట్టపాళెం పంచాయతీ సి.బరినెపల్లె వద్ద శుక్రవారం రూ.2.15 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33-11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. దీంతో వాల్మీకిపురం, కలికిరి మండలాలకు చెందిన 6 గ్రామాల పరిధిలోని రైతులకు మెరుగైన విద్యుత్తు సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం కలకడ మండలంలోని ఎర్రకోటపల్లె విద్యుత్తు ఉపకేంద్రంలో శుక్రవారం అదనంగా ఏర్పాటు చేసిన 5.0 ఎంఈఏ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈలు రమేష్, రామ్మోహన్, వై.చంద్రశేఖర్‌రెడ్డి, డీఈలు రెడ్డికుమార్, జ్ఞానేశ్వర్, డీఈఈ ఎం.శివయ్య, అమీర్‌బాషా, ఓఎస్డీ రమేష్‌బాబు, ఏఈ ముజిబుర్ రహిమాన్, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్తు ఉపకేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్‌ఈ, అధికారులు

ఇంజినీరింగ్ కళాశాలకు పురస్కారాలు

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపల్‌గా జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య సుదర్శనరావు నుంచి పురస్కారం అందుకున్నారు. కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన అవార్డులను శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ అందజేశారు. ఈ సందర్భంగా మిట్స్ విద్యార్థిని కాశీ భార్గవి ఉత్తమ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అవార్డు, సీఎస్ఈకి చెందిన కెవి కార్తీక ఉత్తమ ఇన్నోవేటర్-23 అవార్డులను అందజేశారు. ఈ ఏడాదిలో మిట్స్ కళాశాల మూడు అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. అవార్డు అందుకున్న ప్రిన్సిపల్‌తో పాటు విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


జేఎన్‌టీయూ వీసీ నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపల్ యువరాజ్


డిసెంబరు 1న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

రాజంపేట, న్యూస్‌టుడే : గీతా జయంతిని పురస్కరించుకుని హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో తితిదే ఈ ఏడాది డిసెంబరు 1న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం జిల్లా సహాయ కార్యక్రమ నిర్వహణాధికారి గోపీబాబు, తితిదే ధర్మాచార్యులు గంగవల్లి వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భగవద్గీతలోని 6వ అధ్యాయంలోని 47 శ్లోకాలను పోటీలో చెప్పాల్సి ఉంటుందన్నారు. 6, 7 తరగతులకు ఒక విభాగంగా, 8, 9, 10 తరగతులకు ఒక విభాగంగా జూనియర్, సీనియర్ విభాగాల కింద పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లెక్క తేలుస్తున్నారు..!

- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పశు గణన
- పోషకులకు ఎన్డీయే ప్రభుత్వం చేయూత

\- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ



జిల్లాలో పశువుల లెక్క తేల్చేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. 21వ జాతీయ పశుగణనలో భాగంగా శుక్రవారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమైంది. మార్గదర్శకాలను అనుసరించి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. అందుకోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను అధికారులు నియమించారు. తొలుత సెప్టెంబర్ 1న ప్రారంభించడానికి రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అనివార్య కారణాలతో వాయిదా పడింది. తాజాగా పశువులు, జీవాలు, గుర్రాలు, ఒంటెలు, పందులు, కుందేళ్లు, కుక్కలు, ఇతర జంతువులు, కోళ్లు తదితరాలు కలిపి మొత్తం 16 రకాల పశుజాతులను ఎంచుతున్నారు. రైతు ఇంటి వద్దనే అన్నింటినీ గణించి అంతర్జాలంలో నమోదు చేస్తారు. దీంతో పాటు పశు సంవర్ధక శాఖ అందజేసిన సామగ్రిని కూడా లెక్కించనున్నారు.

పథకాల అమలుకు కీలకం

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పశు సంవర్ధక శాఖ నుంచి దాదాపు 11 శాతం ఆదాయం వస్తోంది. జిల్లాలో పశు పోషణపై ప్రత్యక్షంగానూ.. పరోక్షంగానూ సుమారు నాలుగు లక్షల మందికిపైగా ఆధారపడి జీవిస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలకు కొత్తగా చేపడుతున్న పశుగణన ఎంతగానో దోహదపడనుంది. మరో వైపు పశు పోషకుల ద్వారా ఒనగూరే ఆదాయం పెంచేదుకు వారి అవసరాల రీత్యా పథకాలను కొనసాగించేందుకు ఉపయోగపడుతుంది. నాలుగు నెలలకు పైగా చేపట్టనున్న పశు గణనలో ఒక్కో ఎన్యుమరేటర్ గరిష్ఠంగా రెండు వేల వరకు ఇళ్లను సర్వే చేయనున్నారు. రోజుకు కనీసం 20 ఇళ్లను సర్వే చేయాల్సిందిగా లక్ష్యం నిర్ణయించారు. పశుగణన వివరాలు నమోదు చేయడానికి ప్రత్యేకంగా యాప్ రూపొందించారు.

సిబ్బంది నియామకం

జిల్లా వ్యాప్తంగా పశు గణనకు గాను 292 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. వీరిలో పశు సంవర్ధక సహాయకులు, పారా సిబ్బంది, గోపాలమిత్రలు ఉన్నారు. మరో 50 మంది పశు వైద్యాధికారులకు పర్యవేక్షకులుగా నియమించారు. ఈ ప్రక్రియ అనంతరం సూపర్‌వైజర్లు ఆయా వివరాలను పరిశీలిస్తారు. ఎలా గణించాలనే విషయమై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ ప్రక్రియను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై పర్యవేక్షిస్తారు.


పశువుల నమోదును పరిశీలిస్తున్న జేడీ గుణశేఖర్ పిళ్లై, అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


హరినాథ్ (పాత చిత్రం)

రామాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సురకవాండ్లపల్లె సబ్ స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.. ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిపల్లె పంచాయతీ సురకవాండ్లపల్లెకు చెందిన హరినాథ్ (45) రాయచోటిలోని ఓ చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా.. లక్కిరెడ్డిపల్లెకు చెందిన సయ్యద్ నూర్‌బాషా మరో ద్విచక్ర వాహనంలో వెనకాల వస్తూ ప్రమాదవశాత్తు ఢీకొట్టారు. ఇద్దరికీ గాయాలు కావడంతో తిరుపతి ఆసుపత్రికి తరలించారు. హరినాథ్ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి...

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. గురువారం రాత్రి రేణిగుంట వైపు నుంచి వచ్చిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు రాజంపేటలో ఆగి హైదరాబాద్ వైపు వెళ్లిన తరువాత కొందరు పట్టాలపై వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. రైల్వేస్టేషన్ అధికారులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూశారు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని, నల్ల ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని రేణిగుంట రైల్వే పోలీసులు తెలిపారు.

హత్య కేసు కొట్టివేత

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి మండలం పెద్దగొల్లపల్లెకు చెందిన బుట్టిమాని తిమ్మయ్య అనే వ్యక్తిని అతని స్నేహితులైన రెడ్డిచర్ల రామకృష్ణ, తిమ్మయ్యలు హత్య చేశారనే ఆరోపణలపై నమోదైన కేసును రాయచోటి అయిదో అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి శుక్రవారం కొట్టి వేశారు. 2019 నవంబరు 7న భూ తగాదాలతో పథకం ప్రకారం రెడ్డిచర్ల రామకృష్ణ ఇంట్లో తిమ్మయ్యను హత్య చేశారని అప్పట్లో సుండుపల్లి పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో సరైన ఆధారాలు చూపకపోవడం.. నేరారోపణ రుజువు కాకపోవడంతో పూర్వోపరాలు పరిశీలించిన న్యాయమూర్తి కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారని న్యాయవాది టి.ఈశ్వర్ పేర్కొన్నారు.

ట్రాక్టరు బోల్తా... నలుగురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇటుకలు తరలిస్తున్న ట్రాక్టరు బోల్తా పడి పలువురు గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. గొల్లపల్లెకాలనీలో మధ్యాహ్నం ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టరుపై ఇద్దరు మహిళలు, ఇద్దరు పిల్లలు కూర్చొని వెళ్తుండగా ట్రాక్టరు పల్టీ కొట్టింది. ప్రమాదంలో ట్రాక్టరుపై కూర్చున్న ఇద్దరు మహిళలతో పాటు పిల్లలు గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరంతా బిహార్‌కు చెందిన వారిగా గుర్తించారు. గాయపడిన వారు తమ పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

విగ్రహాల స్వాధీనం... దొంగల అరెస్టు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పంచముఖ విగ్రహాలను అపహరించిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సుధాకర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాజంపేట మండలం పోలి చెరువు కట్టపై ఉన్న శ్రీఆంజనేయస్వామి గుడిలోని పంచముఖ ఆంజనేయ స్వామి, లక్ష్మీదేవి, వినాయకుల ఇత్తడి విగ్రహాలను ఈ నెల 17వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. ఈ విషయమై ఆలయ పూజారులు సుధీర్‌శర్మ, మంజునాథశర్మల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలో రాజంపేట మండలం ఊటుకూరులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద కడప నగరంలోని గౌస్ నగర్‌కు చెందిన షేక్ మస్తాన్, కుమ్మరకుంట వీధికి చెందిన సయ్యద్ మస్తాన్ బాషాలు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా విగ్రహాలను దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో వారి నుంచి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు.


మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్, పక్కన సీఐ రామాంజనేయులు

11లోగా పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : పదోతరగతి పరీక్ష ఫీజును నవంబరు 11వ తేదీ లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబరు 18 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో 25వ తేదీ వరకూ, రూ.500 ఆలస్య రుసుముతో నవంబరు 30 వరకు గడువు ఉందని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి విద్యార్థుల ఫీజు కట్టాలని లేకుంటే ఎట్టిపరిస్థితుల్లో పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఈనాడు'లో శుక్రవారం 'అద్దె బస్సు.. భద్రత తుస్సు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌ఎం స్పందించారు. తరచూ ప్రమాదాలు చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీపై నమ్మకంతో ప్రయాణికులు బస్సులు ఎక్కుతారని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత అందరిదని చెప్పారు. ఏకాగ్రతతో నడపాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


దివ్య

పుల్లంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పీవీజీ పల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని మందా దివ్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివశంకర్‌రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్‌జీఎఫ్ అండర్-17 ఉమ్మడి కడప జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వారు తెలిపారు. త్వరలో రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నట్లు వివరించారు.

వైవీయూలో పికాసో చిత్రాలపై కార్యశాల

వైవీయూ (కడప) : వైవీయూ లలిత కళా విభాగం ఆధ్వర్యంలో ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రాల సరళిపై శుక్రవారం ఒక రోజు కార్యశాల నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో పికాసో చిత్రకళా సౌరభాన్ని తెలుసుకోవడంతో పాటు, డాక్యుమెంటరీ ప్రదర్శించారు. పిన్సిపల్ రఘునాథరెడ్డి, ఆర్ట్స్ విభాగం డీన్ కంకణాల గంగయ్య పాల్గొన్నారు.

బాలికలతో అసభ్య ప్రవర్తన

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరులో బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్పీ ఆదేశాల మేరకు పీలేరు పోలీసులు రంగంలోకి దిగారు. విద్యార్థినులు నెల్లూరు నుంచి హిందూపురంలో జరిగే క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. వీరు గురువారం రాత్రి పీలేరు ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. అక్కడ వీరితో కొందరు ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించారు. ఉపాధ్యాయులు బాలికలను క్షేమంగా తీసుకెళ్లారు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన విద్యార్థులు హిందూపురం వెళ్లి అక్కడ ఉపాధ్యాయులకు విషయం చెప్పారు. దీంతో అక్కడి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకి సమాచారం అందించారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయాలని ఎస్పీ పీలేరు పోలీసులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో పీలేరు పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఈ విషయమై సీఐ యుగంధర్ మాట్లాడుతూ.. విచారణ చేపట్టామన్నారు.

మద్యం తాగి... బస్సుపై పడుకుని...


బస్సుపై నిద్రిస్తున్న వ్యక్తిని లేపుతున్న కండక్టర్

వేంపల్లె, న్యూస్‌టుడే : మద్యం మత్తులో ఓ వ్యక్తి శుక్రవారం ఉదయం వేంపల్లె నుంచి రాయచోటికి వెళ్లే పల్లె వెలుగు బస్సు టాపు పైకి ఎక్కి నిద్రపోయాడు. ఈ విషయం ఎవరూ గమనించకపోవడంతో బస్సు బయలుదేరింది. చక్రాయపేట మండలం నాగులగుట్టుపల్లె వద్దకు వెళ్లేసరికి పైన పడుకున్న వ్యక్తి టాపు చివరకు వచ్చి పడిపోయేలా ఉండడంతో అక్కడి స్థానికులు గుర్తించి కేకలు వేశారు. దీంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేశాడు. కండక్టరు బస్సుపైకి వెళ్లి అతడిని కిందకు దింపారు.

ఘర్షణ.. ఒకరికి కత్తిపోట్లు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని చిట్వేలి రోడ్డులో గురువారం రాత్రి దారపనేని వెంకటేష్, కట్టా వంశీకృష్ణ అనే ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరిగినట్లు సీఐ హేమసుందర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఓ వివాహానికి వెళ్లగా అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన వెంకటేష్ వంశీకృష్ణపై కత్తితో దాడి చేశాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వివరించారు.

ద్విచక్రవాహనాలను ఢీకొన్న కారు

ఇద్దరు దుర్మరణం


చిన్నసిద్దారెడ్డి


మన్సూర్

(పాత చిత్రాలు)

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సీకేదిన్నె మండల పరిధిలోని ఊటుకూరు వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనాలను కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు ద్విచక్రవాహనాదారులు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. కడప నుంచి రాయచోటికి వెళుతున్న కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాలపై వెళుతున్న ఊటుకూరుకు చెందిన పొన్నోలు చిన్న సిద్ధారెడ్డి, మన్సూర్‌లను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. చిన్న సిద్ధారెడ్డిని (52), మన్సూర్ (19) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.

ఎర్రచందనం స్వాధీనం... ఇద్దరి అరెస్టు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం రేంజిలో శుక్రవారం అటవీ అధికారులు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు తమిళ కూలీలను అదుపులోకి తీసుకున్నారు. సిద్దవటం అటవీక్షేత్రాధికారిణి కళావతి మాట్లాడుతూ మద్దూరు బీటులోని నీలసరికోన అటవీ ప్రాంతంలో సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా, కొందరు వ్యక్తులు కన్పించడంతో వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశామన్నారు. తమిళనాడులోని సేలం జిల్లా, నయమలై గ్రామానికి చెందిన రంగస్వామి, భూపాలన్ అనే కూలీలు పట్టుబడగా, మరికొందరు పరారయ్యారని చెప్పారు. ఘటనా స్థలంలో 23 ఎర్రచందనం దుంగలు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులను విచారించగా చాపాడు మండలం ఖాదర్‌పల్లి గ్రామానికి చెందిన జాకీర్ అనే వ్యక్తి తమను ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రోత్సహించినట్లు చెప్పారని వెల్లడించారు. వారిని తిరుపతిలోని న్యాయస్థానంలో హాజరుపరిచామన్నారు. కొండూరు సెక్షన్ అధికారి సురేష్, బీటు అధికారులు దీపిక, విశ్వనాథ్‌రెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం, ఇద్దరిని అరెస్టు చేసిన అటవీ అధికారులు

దిమ్మెలు ఏర్పాటు చేయడంపై దుకాణదారుల ఆందోళన

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువులో జాతీయ రహదారి పనులు చివరి దశకు చేరుకున్నాయి. రోడ్డుకు ఇరువైపులా దిమ్మెలు ఏర్పాటు చేస్తుండడంతో మండల కేంద్రంలోని దుకాణదారులు శుక్రవారం పనులను అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దుకాణాల ముందు దిమ్మెలు ఏర్పాటు చేస్తే వ్యాపారాలు జరగవని దుకాణదారులు వాపోయారు. రోడ్డుకు ఇరువైపులా దిమ్మెలు ఏర్పాటు చేయడంతో బ్యాంకులతో పాటు ఆసుపత్రులకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గుత్తేదారులు పనులు చేపడుతుండటంతో వాహనాలకు అడ్డుగా కూర్చుని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తెదేపా తంబళ్లపల్లె నేత జయచంద్రారెడ్డి గుత్తేదారులు, అధికారులు, దుకాణదారులతో చర్చించి 30 అడుగులకు ఒకచోట వాహనాలు వెళ్లేలా దారి ఏర్పాటు చేయాలని సూచించారు. 30 అడుగులకు ఒక చోట దారి వదిలి దిమ్మెలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రాజా రమేష్, ఎస్ఐ గాయత్రి సమక్షంలో గుత్తేదారులు, అధికారులకు తెలిపారు. దుకాణాలకు వెళ్లేందుకు దారి ఇవ్వడంతో దుకాణదారులు ఆందోళన విరమించారు.


రోడ్డుపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న దుకాణదారులు

నేటి నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

రాజంపేట, న్యూస్‌టుడే: తెదేపా కుటుంబంలో సభ్యత్వ నమోదు ద్వారా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెదేపా పార్లమెంట్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన అందిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26వ తేదీ శనివారం నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రతువులో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాత్రికేయుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

రాయచోటి, న్యూస్‌టుడే: అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తున్నామని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ఆయన ఛాంబర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలన్నింటిలో ఫీజులో రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల యూనియన్ నాయకులు జేసీకి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి క్రికెట్‌లో ప్రతిభ చాటేలా ప్రోత్సహించాలని ఏపీ క్రికెట్ అసోసియేషన్ మౌలిక సదుపాయాల కమిటీ ఛైర్మన్ విజయకుమార్ కోరారు. శుక్రవారం ఆయన మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సబ్‌సెంటర్లు ఏర్పాటు చేసి క్రికెట్‌లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసినేని చిన్ని, కార్యదర్శి సాన సతీష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో క్రికెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్, శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ సతీష్‌యాదవ్, సీడీసీఏ శిక్షకుడు సునీల్, క్రీడాభారతి సభ్యులు నరేష్, విజయ్, విష్ణు, ఉదయ్, పార్థసారథి, వ్యాయామ ఉపాధ్యాయులు శరత్, మహేష్, విజయ్, సీనియర్ క్రీడాకారులు శ్రీకాంత్, భరత్, నాగరాజు, మురళీ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న విజయకుమార్

ప్రైవేట్ పాఠశాలల విద్యాసదస్సు రేపు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు జరుగుతుందని అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని అందరూ పాల్గొనాలని కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ...

రాయచోటి, న్యూస్‌టుడే: దిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను ఈ నెల 27న రాయచోటిలో నిర్వహించనున్నామని పౌరహక్కుల సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, పి.రెడ్డెయ్యలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జైలు జీవితం నుంచి వచ్చిన తర్వాత ఆయన మృతి చెందడం ఉద్యమకారులకు తీరని లోటన్నారు. మేధావులు, విద్యార్థులు హాజరవ్వాలని కోరారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

వాల్మీకిపురం: శివపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

రామసముద్రం: రామసముద్రం మండలం తిప్పసాని పల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ఉదయం కుంభారాధన, ప్రాణప్రతిష్ఠ హోమాలు నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే దేశాయితిప్పారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ వైకాపా బాధ్యుడు నిస్సార్‌అహ్మద్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

పీలేరు: విద్యార్థులకు మెనూ ప్రకారం మూడు పూటలా ఆహారం అందించాలని పీలేరు పదకొండో జిల్లా అదనపు న్యాయమూర్తి మహేష్ సూచించారు. శుక్రవారం మదనపల్లె మార్గంలోని ఎస్సీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం సక్రమంగా అందుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో వంట సామగ్రి, సరకుల నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, స్నానాల గదులు పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని విద్యార్థులకు సూచించారు.


సరకులు తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి మహేష్

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: కోళ్లబైలు పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. పాములతో భయాందోళన చెందుతున్నారు. **- వెంకటరమణ, ఇందిరమ్మ కాలనీ**

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **- ఆనంద్‌రెడ్డి, సర్పంచి, కోళ్లబైలు**

?: కొండమర్రిపల్లె పంచాయతీ ఇసుకమోరిపల్లె సమీపంలోని చెరువుమట్టిపై పిచ్చిమొక్కలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- నాగరాజు, కొండమర్రిపల్లె**

✓: రోడ్డుకిరువైపులా ముళ్లకంపచెట్లు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- రవినాయక్, కార్యదర్శి, మదనపల్లె**

?: బొమ్మనచెరువు పంచాయతీ మండలం జగనన్న కాలనీలో రోడ్డుపై మట్టిదిబ్బలున్నాయి. కాట్లాటపల్లెకు వెళ్లే మార్గంలో ఇళ్ల నిర్మాణాల కోసం వేసిన మట్టి అడ్డుగా ఉండటంతో రాత్రి వేళ్లలో వాహనాల రాకపోకలకు కష్టంగా ఉంది. వాహనచోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. **- రాజశేఖర్, బొమ్మనచెరువు**

✓: రోడ్డుపై మట్టి దిబ్బలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె**

నాసిరకం పనులు... వాహనదారుల అవస్థలు


బి.కొత్తకోట శివార్లలోని హంద్రీ-నీవా వంతెన వద్ద కుంగిన రహదారి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: గత వైకాపా నాయకుల నిర్లక్ష్యం కారణంగా బి.కొత్తకోటలో అభివృద్ధి ఎక్కడికక్కడే నిలిచిపోయింది. అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బి.కొత్తకోటలోని బెంగళూరురోడ్డులో ఉన్న హంద్రీ-నీవా వంతెన రహదారి నాసిరకం పనుల కారణంగా కుంగిపోయింది. గతేడాది నిర్మించిన రహదారి కొద్దిపాటి వర్షానికే దెబ్బతినడంపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు బి.కొత్తకోట-బెంగళూరు రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరించి అభివృద్ధి చేశారు. ఈ పనుల కోసం రహదారుల శాఖ రూ.23 కోట్లు మంజూరు చేయగా.. కంబాలపల్లె వద్ద వంతెన నిర్మాణం మినహా మిగిలిన పనులు ముగించారు. ఇందులో భాగంగా స్థానిక సుంకు బలరాం జూనియర్ కళాశాల వద్ద హంద్రీ-నీవా కాలువకు అడ్డుగా వంతెన నిర్మించారు. దీనిపై రహదారిని నిర్మించి రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లో పెద్దగా నీరు చేరలేదు. ఇదే సమయంలో హంద్రీ-నీవా వంతెనపై నిర్మించిన రహదారి కుడివైపున కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. ఎడమవైపున కూడా రహదారి కోతకు గురైంది. చోదకులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వాహనం గుంతలో పడే ప్రమాదముంది. సాధారణ వర్షాలకే రహదారి పాక్షికంగా దెబ్బతినగా.. భారీ వర్షాలు కురిస్తే కొట్టుకుపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై రహదారులు, భవనాలశాఖ మదనపల్లె డీఈ సూర్యనారాయణరెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కుంగిన రహదారికి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రహదారి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు


ఎంపీడీవో మస్తాన్‌వలీకి ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: తమ కాలనీలకు వెళ్లే రహదారిని ఆక్రమించుకుని దారి లేకుండా చేశారని కొండమర్రిపల్లె పంచాయతీకి టీఎన్ఆర్ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల ప్రజలు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం వారంతా ఎంపీడీవో మస్తాన్‌వల్లి, తహసీల్దారు ఖాజాబీకు ఫిర్యాదు చేశారు. గత 30 ఏళ్లుగా కాలనీలో రోడ్డుగా ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని దారి లేకుండా చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. దీనిపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు రమణ, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, బాబాసాహెబ్, శ్రీరాములురెడ్డి, నాగార్జున, రామకృష్ణ, మంగమ్మ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చాటి... విజేతలుగా నిలిచి


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రసాద్, ఉపాధ్యాయులు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మదనపల్లె విద్య, పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లెలోని రెడ్డెప్పనాయుడు కాలనీలోని ఎస్‌వీఎల్ ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో కె.ఉదయ్‌కార్తిక్ (10వ తరగతి), వి.లక్ష్మీ (9వ తరగతి), పి.రోహిత (8వ తరగతి) విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ రాటకొండ ప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పలతాదేవి, ఉపాధ్యాయులు ప్రదీప్, శంకర్‌యాదవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మదనపల్లె విద్య, పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లెలోని భాష్యం ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఉమేరాఅంజూమ్ (9వ తరగతి), ఆర్.తనూష (9వ తరగతి), ఎం.పుష్యమి (8వ తరగతి)లకు ప్రిన్సిపల్ దుర్గప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.ఎన్.శంకర్, స్రవంతి, సరస్వతి, ఆయేషా, మురళి, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు స్మరించుకుందాం

రామసముద్రం, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుందామని కడప 11వ బెటాలియన్ ఆర్ఐ గోవిందరాజు పిలుపునిచ్చారు. రామసముద్రం ఉన్నత పాఠశాలలో శుక్రవారం అమరవీరుడు కానిస్టేబుల్ రమేష్ సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో జరిగిన ముష్కరుల దాడిలో రమేష్ మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, బెటాలియన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుడు రమేష్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కడప 11వ బెటాలియన్ ఆర్ఐ గోవిందరాజు, అధికారులు

తెదేపా సభ్యత్వం భవిష్యత్తుకు భరోసా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

ములకలచెరువు, న్యూస్‌టుడే : తంబళ్లపల్లె నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు నమోదయ్యేలా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని తెదేపా తంబళ్లపల్లె నేత జయచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం ములకలచెరువులో సభ్యత్వ నమోదుపై తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెదేపా సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం పొందేలా కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు పర్వీన్‌తాజ్, తెదేపా బీసీ సెల్ అధికార ప్రతినిధి త్యాగరాజు, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు తులసీధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె టీపీఓగా జకీరాఖాతూన్

మదనపల్లె పట్టణం : మదనపల్లె పురపాలక సంఘం టీపీఓగా జకీరాఖాతూన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు నగరపాలక సంస్థలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

పిల్లలను పనిలో పెడితే కఠిన చర్యలు

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : దుకాణాలు, హోటళ్లు, మెకానిక్‌షాపుల యజమానులు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పీలేరు సహాయ కార్మికశాఖ అధికారి ఆనంద బాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గర్నిమిట్టలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద పిల్లలను వసతిగృహాలలో ఉంచి చదివిస్తున్నామన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

కలకడ, న్యూస్‌టుడే : కలకడ విద్యుత్తు ఉపకేంద్రంలో శనివారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కలికిరి డీఈఈ శివయ్య తెలిపారు. బాలయ్యగారిపల్లె, దొడ్డిపల్లె, బాటవారిపల్లె ఫీడర్ల పరిధిలోని రైతులు సహకరించాలని కోరారు.

విద్యార్థికి సబ్‌కలెక్టర్ అభినందన


లోహాన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : పోషకాహార లోపాలపై ప్రాజెక్టు తయారు చేసిన మదనపల్లెలోని ప్రశాంత్‌నగర్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థి లోహాన్‌ను శుక్రవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అభినందించారు. లోహాన్ ప్రాజెక్టు వర్కులో భాగంగా న్యూట్రీషన్, విటమిన్ లోపం, వీటిని ఏ విధంగా అరికట్టాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాజెక్టు తయారు చేసి మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. దీన్ని పరిశీలించిన ఆయన విద్యార్థిని అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్, రీజినల్ బాధ్యుడు శ్రీధర్, ప్రిన్సిపల్ మహమ్మద్ రఫితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని అభినందించారు.

పాడిరైతుల సంక్షేమానికే పశుగణన


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ నీరజ, అధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం : పాడి రైతుల సంక్షేమానికి పశుగణన చేపడుతున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ నీరజ పేర్కొన్నారు. స్థానిక పశువైద్యశాల ఆవరణలో శుక్రవారం ఆమె అధికారులు, సిబ్బందితో కలిసి 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్టోబరు 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకిపురం, గుర్రంకొండ పశువైద్యాధికారులు చరిత, అనూష, సుధీర్‌రెడ్డి, సునీల్‌నాయక్, సలీం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : గొర్రెలు, మేకలకు నట్టలు సోకకుండా మందులు వేయించాలని మదనపల్లె పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి సూచించారు. చీకిలబైలు పంచాయతీ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నట్టలతో గొర్రెలు, మేకలు అనారోగ్యం పాలవుతాయన్నారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి

కలికిరి, న్యూస్‌టుడే : రైతులు పశుగణనకు సహకరించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు వెంకటమునినాయుడు కోరారు. శుక్రవారం కలికిరి మండలం మర్రికుంటపల్లె పంచాయతీ ఎల్లంపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచి రెడ్డిరామ్ ఆధ్వర్యంలో పశుగణన కరపత్రాలు ఆవిష్కరించారు. నాలుగు నెలల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పశుగణన నిర్వహిస్తామన్నారు.

ములకలచెరువు : తంబళ్లపల్లె మండలంలోని గ్రామాల్లో పశుగణనపై పశువైద్య సిబ్బంది దృష్టి సారించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ సుమిత్రదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం తంబళ్లపల్లె పశువైద్యశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పశుగణన పూర్తి చేసి పశుసంపద అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. సచివాలయాల పరిధిలోని పశువైద్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది పశుగణన సర్వే నిర్వహించి పశువులను గుర్తించాలన్నారు.

పాలకమండలి సభ్యులుగా అవకాశం కల్పించడం అభినందనీయం

మదనపల్లె పట్టణం : నాయీబ్రాహ్మణులకు దేవాలయాల పాలక మండలిలో సభ్యులుగా అవకాశం కల్పించడం అభినందనీయమని రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికార సమితి సోషల్‌మీడియా కోఆర్డినేటర్ మంగళ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయీబ్రాహ్మణులకు దేవాలయాల్లో పనిచేసేవారికి రూ.25 వేలు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకొందని విమర్శించారు.

క్షయ నివారణపై అవగాహన

పెద్దతిప్పసముద్రం : క్షయ నివారణపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్యాధికారిణి శైలజ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని కమ్యూనిటీ హెల్త్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ బాధితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలన్నారు. ప్రభుత్వం క్షయ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఆరోగ్య కేంద్రాలలో క్షయ నిర్ధారణ యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

బలవంతపు రాజీనామాలు చేయించిన వారిపై చర్యలకు డిమాండు


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నాయకులు

రామసముద్రం, న్యూస్‌టుడే: సాధారణ ఎన్నికల సమయంలో వాలంటీర్లతో బలవంతపు రాజీనామాలు చేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండు చేశారు. రామసముద్రం ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐటీయూసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వాలంటీర్లను ప్రభుత్వం విధుల్లోని చేర్చుకోవాలని, లేకుంటే పోరాటమే శరణ్యమన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సంఘం నాయకులు సురేష్‌కుమార్, ఫయాజ్, బాబాజాన్, వెంకటచలపతి, వెంకటరెడ్డి, సల్మా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కుటుంబ సమస్యలతో మదనపల్లె పట్టణంలోని అనపగుట్టకు చెందిన శివరాం (30) అనే ఆటో డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శివరాం ఆటోలో సిమెంటు తరలించి జీవనం సాగిస్తున్నారు. కుటుంబ సమస్యలతో శుక్రవారం రాత్రి మదనపల్లె టమాటా మార్కెట్ ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు గుర్తించి ఆయనను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండోపట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సారా విక్రయిస్తున్న మహిళను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు మదనపల్లె రెండో పట్టణ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన అంజనమ్మ (35) సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశామన్నారు. ఆమె నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని బీకేపల్లె కాలనీకి చెందిన మహిళ (35) ఈనెల 18వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లక్ష్యాలు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న ఎల్‌డీఎం ఆంజనేయులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని ఎల్‌డీఎం ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం సంయుక్త మండస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం కేటాయించిన లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు రుణాలిచ్చి వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని, మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేవిధంగా చూడాలన్నారు. కిసాన్‌కార్డులు అన్ని బ్యాంకులు ఇవ్వాలన్నారు. రుణాల పంపిణీల్లో ఇబ్బందులు ఉంటే తెలపాలని పశుసంవర్ధకశాఖ డీడీ సత్యనారాయణ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు స్థాయినిబట్టి రూ.10 లక్షల వరకు రాయితీ రుణాలు ఇస్తామని ఇండస్ట్రీస్ ప్రమోషన్ అధికారి శంకర్ తెలిపారు. మహిళా సమాఖ్య ద్వారా వచ్చిన దరఖాస్తులపై విచారించి వారికి బ్యాంకు అధికారులు రుణాలివ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏపీఎంలు, సీసీలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి వినతి



ఉప తహసీల్దారు మానసకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : మండలంలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం ఉప తహసీల్దారు మానసకు వినతి పత్రం అందజేశారు. రైల్వేకోడూరు పరిధిలో 300 మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. వారికి ఇంటి స్థలాలు, బంజరు భూములు కేటాయించాలన్నారు. సదరం ధ్రువ పత్రాల మంజూరును కోడూరు ప్రభుత్వాసుపత్రిలోనే ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ నాయకులు పెంచలయ్య, ప్రకాష్, ఇంద్రమ్మ, శ్రీను, అరుణ, మాధవి, దేవి పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై సమావేశం



స్టేట్‌బ్యాంకులో విద్యార్థులతో మేనేజరు అంజిరెడ్డి, సిబ్బంది

చిన్నమండెం, న్యూస్‌టుడే: బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని చిన్నమండెం స్టేట్ బ్యాంకు మేనేజరు అంజిరెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం ఆదర్శ పాఠశాల, కళాశాలలో వృత్తి విద్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా శుక్రవారం శిక్షకుడు సాయినాథ్ ఆధ్వర్యంలో ర్యాలీగా స్టేట్‌బ్యాంకుకు వచ్చారు. మేనేజరు, సిబ్బంది విద్యార్థులకు బ్యాంకులో ఖాతాలు తెరవడం, నగదు జమచేయడం, తీసుకోవడం వంటి సేవలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు తెలియజేశారు. ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠకు జిల్లా బాధ్య మంత్రికి ఆహ్వానం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ భుజంగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 27వ తేదీ ఆదివారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆహ్వానించినట్లు ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మందల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందించి కోరినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు, పుర ప్రజలు హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందిన వారిని తొలగించాలి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో ఒప్పంద పారామెడికల్ విభాగంలో తప్పుడు ధ్రువ పత్రాల ద్వారా ఉద్యోగం పొందిన వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఒప్పంద పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. గత ప్రభుత్వం ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని మోసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వమైనా అర్హులైన పారామెడికల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు.

అమరావతి రైలు మార్గానికి ఆమోదం శుభపరిణామం

రాజంపేట: రాష్ట్ర రాజధాని అమరావతి రైలు మార్గానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం శుభ పరిణామమని.. ఇది డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే సాధ్యమౌతుందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 160 కిలోమీటర్ల రైలు మార్గానికి సాగించేలా కొత్త రైలు కారిడార్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. పార్టీ నాయకులు పాపయ్య, రమణ, సూర్యచంద్ర, నవీన్‌కుమార్, రమణారెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీసులు

రాయచోటి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసులకు పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, ఎస్ఐలు ఈ పోటీలో పాల్గొన్నారు. వక్తృత్వం పోటీలు నిర్వహించారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ ఈనెల 27వ తేదీ వరకు ఈ వారోత్సవాలు కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు విధులు, సమాజంలో వారి పాత్రపై విద్యార్థులలోనూ అవగాహన కల్పించడం జరుగుతుందని ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



నట్టనివారణ టీకాలు వేస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి గుణశేఖర్ పిళ్లై, ఇతర అధికారులు

రాజంపేటగ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా పశుగణన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై సిబ్బందిని ఆదేశించారు. కూచివారిపల్లిలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పశువుల సంఖ్యను గుర్తిస్తామన్నారు. దీంతో పాడి పరిశ్రమ, మూగజీవాల పెంపకం వంటి వివరాలు పూర్తిగా తెలుస్తాయన్నారు. అనంతరం పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. రాజంపేట డివిజనల్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ సురేష్‌రాజు, సహాయక ఉప సంచాలకులు డాక్టర్ ఎన్ ప్రతాప్, డాక్టర్ భాగ్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

సుండుపల్లి: పశుగణన కార్యక్రమం వచ్చే ఏడాది 28 వరకు జరుగుతుందని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కె.విజయకుమార్ పేర్కొన్నారు. సుండుపల్లి కార్యాలయంలో ప్రచార పత్రాలు విడుదల చేశారు.

భాజపా సభ్యత్వ నమోదు

రాయచోటి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వాన్ని యువత ఎక్కువగా పొందాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందగజపతిరాజు పేర్కొన్నారు. రాయచోటి భాజపా నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాన మంత్రి చేపట్టిన అనేక కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. నమోదు కార్యక్రమానికి పార్టీ నేత మోడెం ఆంజనేయప్రసాద్ ప్రచార రథాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిర్మల్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, హనుమాన్‌నాయక్, సురేంద్ర, ధీరజ్, నందగోపాల్ పాల్గొన్నారు.

గాలివీడు... బాగుపడేదెన్నడు!

వాణిజ్య కేంద్రమైనా కనిపించని ప్రగతి • పట్టించుకోని అధికారులు

– న్యూస్‌టుడే, గాలివీడు

వాణిజ్య కేంద్రమైన గాలివీడు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవట్లేదు. ఉన్నత, సాంకేతిక విద్యావకాశాలు, ఉపాధిని కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు, పాలకులు మారినా వనరులు కల్పించలేదు. ఈ ప్రాంత రాజకీయ పార్టీల నాయకులు అభివృద్ధిని గాలికొదిలేశారు. కనీస సదుపాయాలు కల్పించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

● రాయచోటి-కదిరి ప్రధాన మార్గంలో గాలివీడు పట్టణంలో నాలుగు వరుసల రహదారి అభివృద్ధి పనులు రూ.7 కోట్లతో పూర్తి చేశారు. నిధుల కొరతతో కదిరి దారిలో పెట్రోలు బంకు నుంచి దిగువ రైస్ మిల్లు వరకు సిమెంటుకు బదులు తారురోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు. అప్పట్లో రహదారికి ఇరువైపులా నిర్మించిన కాలువలు సన్నవిగా ఉండటంతో వర్షపు నీరు కాలువల్లో పొంగి దారిపై ప్రవహిస్తోంది.

● అంచనాల మేరకు రహదారి విస్తరణ పనులు పూర్తి చేయకుండానే స్థిరాస్తిదారుల ఆర్థిక, రాజకీయ ఒత్తిళ్లకు రోడ్డును కొన్ని ప్రాంతాల్లో కుదించి వేశారు. విద్యుత్తు స్తంభాల ఏర్పాటులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నీటి పారుదల కాలువలు లేని లక్కిరెడ్డిపల్లెకు వెళ్లే రహదారి

● గాలివీడు బస్టాండ్, నాలుగురోడ్ల కూడలి అభివృద్ధి పనులు అసంపూర్తిగా కొనసాగాయి. ప్రధాన రహదారి నుంచి అరవీటివాండ్లపల్లె, దానంరెడ్డిగారిపల్లె రోడ్ల విస్తరణ పనుల జోలికి వెళ్లలేదు. వ్యాపారాలకు అనుకూలంగా ఉండటంతో రోడ్డుపై చొచ్చుకుని అక్రమ కట్టడాలు చేపట్టారు. రహదారి కుంచించుకుని పోవడంతో బస్సు సర్వీసులు నడపలేక రద్దు చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రాజకీయ నాయకులు వస్తున్నారే తప్ప సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపట్లేదని స్థానికులు వాపోతున్నారు.

● గేట్ నుంచి లక్కిరెడ్డిపల్లె దారిలో అవులశెట్టిగారిపల్లె నివాసిత ప్రాంతంలో మురుగు కాలువలు నిర్మించలేదు. దీంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగు, వర్షపు నీరు లోతట్టు ప్రాంతాల్లో రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దీంతో రోడ్డు దెబ్బతిని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే పరిస్థితి మదనపల్లె మార్గంలోనూ నెలకొంది.

● గేట్ నుంచి బస్టాండ్ వరకు వాహనాల పార్కింగ్ స్థలం కేటాయించ లేదు. దీంతో రోడ్డుపైన వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇళ్ల నుంచి వెలువడే చెత్తా, వ్యర్థ పదార్థాలను కొందరు రోడ్డు డివైడర్‌లోని మొక్కల మధ్యలో పడేస్తుండటంతో వాహనదారులకు అసౌకర్యంగా ఉంటోంది.


● గాలివీడులో డిగ్రీ, సాంకేతిక విద్యను అభ్యసించేందుకు పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఉన్నత చదువుల కోసం 30 నుంచి 45 కి.మీ దూరంలోని పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది.



గాలివీడు ప్రధాన రహదారి ప్రాంతంలో రద్దీ

తూముకుంట, వెలిగల్లు ప్రాంతాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పినా అందులో సాంకేతిక ఉద్యోగ అవకాశాలే ఎక్కువగా ఉండటంతో స్థానికేతరులకే లబ్ధి చేకూరుతోంది.

ట్రాఫిక్‌కు అంతరాయం



గాలివీడులో పేరుకు నాలుగు వరుసల రహదారి ఉన్నా.. వాహనాలకు పార్కింగ్ స్థలం ఎక్కడా లేదు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వివిధ పనుల నిమిత్తం గాలివీడుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

\- ఎల్.రెడ్డెప్పనాయుడు, గోపనపల్లె

రహదారులు, కాలువలు నిర్మించాలి



గాలివీడు-లక్కిరెడ్డిపల్లె మార్గంలోని అవులశెట్టిగారిపల్లె మార్గంలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీరు, వర్షపునీటి నిల్వలతో దుర్గంధం వెదజల్లుతోంది. రవాణాకు అడ్డంకిగా ఉన్న నీటి గేట్‌వాల్వ్ గొట్టాలు తొలగించాలి.

\- మోడం చిన్నయ్య, అవులశెట్టిగారిపల్లె

స్పందనకు వందనం

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సోమవరం పంచాయతీ వడ్డెపల్లెలో రోడ్డుపై నిల్వ ఉన్న వాననీటిని అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. మేమున్నాం మీకు తోడుగాలో 'రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని తొలగించండి' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఈవోఆర్డీ రామచంద్రారెడ్డి స్పందించారు. గ్రామ కార్యదర్శితో కలిసి నీటి నిల్వలను తొలగింపజేశారు.

సీసీ రహదారి పనులు పూర్తి చేయాలి

పెనగలూరు: మండల పరిధిలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో విజయారావు సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉండే గుత్తేదారులతో మాట్లాడి పనులు వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. పలు రకాల విషయాలపై అధికారులతో చర్చించారు.

ఆర్టీసీ బస్టాండులో మరమ్మతులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెం ఆర్టీసీ బస్టాండులో మరమ్మతు పనులు మొదలయ్యాయి. ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. ముఖ్యంగా వర్షాలకు గుంతలమయంగా ఉన్న బస్టాండు ఆవరణం మట్టితో చదును చేసి కంకర పొడి వేసి నీటిని పడుతున్నారు. ఇలా చేయడం వలన గుంతలు పూర్తిగా పూడిపోతాయని వారు తెలిపారు.

చెరువులోకి చేరుతున్న వరదనీరు

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సానిపాయి కొలిమిమిట్ట అటవీ ప్రాంతంలో వారం రోజులుగా కురిసిన వర్షాలకు చిన్న చిన్నకుంటలు నిండాయి. మద్దెలవంకలో చెక్‌డ్యాంలు నిండి నీటి ప్రవాహం కృష్ణారెడ్డి చెరువుకు చేరుతోంది. వారం కిందట చుక్క నీరు కూడా లేని కృష్ణారెడ్డి చెరువు జలకళను సంతరించుకుంటోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం ఊటుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వేకోడూరు మండలానికి చెందిన తుర్రా విక్రమ్ (26) యువకుడు తీవ్రంగా గాయపడినట్లు మన్నూరు సీఐ రామాంజనేయులు తెలిపారు. రైల్వేకోడూరు నుంచి ద్విచక్ర వాహనంపై రాజంపేటకు వెళ్తున్న విక్రమ్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. లారీ టైర్ల కింద విక్రమ్ పడటంతో ఆయన రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని స్థానికులు చెప్పారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. పట్టణంలోని సత్య షోరూం మేనేజర్‌గా పని చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఇద్దరు మహిళలకు...

రాజంపేట గ్రామీణ: మన్నూరు చెరువు కట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడినట్లు మన్నూరు సీఐ రామాంజనేయులు తెలిపారు. ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న అంజలి, రమ్యలు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న లోహిత్‌వర్మ అనే వ్యక్తి వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని వివరించారు.

ప్రతిభకు పట్టం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అడ్మిన్ డైరెక్టర్ మదన్‌మోహన్, ఉపాధ్యాయులు

రైల్వేకోడూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు మండల పరిధిలోని విజ్‌డమ్ సీబీఎఈ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభాపాటవ పోటీలు చేపట్టారు. 'అంతర్జాలం, చరవాణి వినియోగం వల్ల కలిగే లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. తొమ్మిదో తరగతి నుంచి వి.దీక్షిత, ఎస్ సాయి వెంకట శివ, ఎం.యశ్విని విజేతలుగా నిలిచారు. అడ్మిన్ డైరెక్టరు మదన్ మోహన్, ఉపాధ్యాయులు జోనా, వసంత పాల్గొన్నారు.

ప్రతి సభ్యురాలు లక్షాధికారి కావాలన్నదే లక్ష్యం

పుల్లంపేట, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘంలోని ప్రతి సభ్యురాలు లక్షాధికారిణి కావాలని వెలుగు ఏపీ మల్లికార్జునరాజు పేర్కొన్నారు. స్థానిక వెలుగు సభాభవనంలో శుక్రవారం 16వ ఆర్థిక మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అభయహస్తం బీమా చెల్లించిన వారు అధైర్యపడొద్దన్నారు. అనంతరం మండల సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా అనూష, కార్యదర్శిగా దివ్య, కోశాధికారిగా గుల్జార్‌ను ఎన్నుకున్నామన్నారు. ఏపీఎం సుబ్బలక్షుమ్మ, సీసీలు వెంకటసుబ్బయ్య, రుద్రాచారి, రమణమ్మ, అకౌంటెంట్ అనిత పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యల పరిష్కారానికి కృషి

చిన్నమండెం, న్యూస్‌టుడే: భూముల రీసర్వేలో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉప తహసీల్దారు రెడ్డిబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని బోనమలలో రీసర్వేలో సమస్యలపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 35 అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీ పరిష్కారం చేస్తామని వివరించారు. మండల సర్వేయరు శ్యామల, సర్వేయర్లు అశోక్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

– న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

అధికారుల నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు

రూ.కోట్ల విలువ చేసే భూమిని భావితరాల భవిత కోసం దశాబ్దాల కిందట దాతలిచ్చిన భూమిని కొందరు అక్రమార్కులు దోచుకునేందుకు యత్నిస్తున్నారు. రాజంపేట పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని కొంత భూమిని కబ్జా చేసేందుకు శుక్రవారం తాత్కాలిక కట్టడాలు ఏర్పాటు చేసి ఆక్రమించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇదీ సంగతి : రాజంపేట ప్రభుత్వ విద్యా సంస్థలకు దాదాపు 15 ఎకరాల క్రీడా మైదానం ఉండేది. రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు కావడంతో నిర్మాణ సమయంలో కొంత భాగాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఈ సమయంలో ఏర్పాటు చేసి అప్రోచ్ రోడ్డు కారణంగా రోడ్డుకు ఇరువైపులా 10 నుంచి 20 అడుగుల మేర కళాశాలకు చెందిన భూమి మిగిలిపోయి ఉండడంతో ఆక్రమణదారులకు కల్పతరువుగా మారింది. ఇక్కడ సెంటు పది లక్షలు ఉండడంతో ఆక్రమణదారులు రాత్రి వేళల్లో పనులు చేయడం పగలు అధికారులు వచ్చి తొలగించడం పరిపాటిగా మారింది.

● గతేడాది ఇదే స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నించడంతో 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అప్పటి కలెక్టర్ గిరీష కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయడంతో అక్రమార్కులు నిర్మాణ పనులు వదిలేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం మళ్లీ ఆక్రమించేందుకు యత్నించడంతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే అక్రమ కట్టడాలను తొలగిస్తామని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.



క్రీడా మైదానం స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన తాత్కాలిక కట్టడాలు

న్యాయమూర్తికి అభినందనలు

రాజంపేట, న్యూస్‌టుడే: ఇటీవల విజయవాడలో జరిగిన ఓ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమంలో ఆంధ్రరత్న అవార్డును అందుకున్న రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌ను ఉమ్మడి కడప జిల్లా బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో ముందుకు సాగాలని మానవత సంస్థ రాయచోటి శాఖ అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లితండ్రుల ఆశలు, గురువులు ఆశయాలకు అనుగుణంగా పిల్లలు నడుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యాలను విస్మరించకుండా ముందుకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ ఛైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, ప్రిన్సిపల్ రేఖ, కార్యదర్శి జయచంద్ర, గౌరవాధ్యక్షుడు వెంకటరమణ, ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

మన్నూరు... సమస్యలతో బేజారు

• మౌలిక వసతులు కరవు • పట్టని పురపాలక అధికారులు

– న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

గ్రామ పంచాయతీలలో పనులు చేయాలంటే ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు పనులు గుర్తించి ప్రభుత్వ అనుమతితో పనులు చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా పురపాలక ప్రాంతంలో కేవలం పాలక మండలి తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడం జరుగుతుంది. అంతే కాకుండా పనులు తర్వగా పూర్తి చేయడానికి ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. అలాంటి అవకాశాలు ఉన్నా అభివృద్ధి పనులు చేయడంతో పురపాలక సంఘంలోని అధికారులు పాలక మండలి నేతలు పని చేయడం లేదు. దీంతో వార్డులు అభివృద్ధి చెందకపోవడం కంటే సమస్యల వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి.

ఇదీ పరిస్థితి...

రాజంపేట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలోనే రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు, మంచి నీటి పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘంగా మార్పు చేసిన తరుతా కొన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందినా.. మన్నూరు ప్రాంతంలో మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మన్నూరు గ్రామం ఎర్రబల్లి వద్ద కనిపించని కాలువలు



మన్నూరు సమీపంలోని నారపురెడ్డిపల్లిలో ఏర్పాటు కాని విద్యుత్తు స్తంభాలు

● మన్నూరు పరిధిలో నాలుగు వార్డులున్నాయి. పట్టణ జనాభాలో ఎక్కువ మంది ఇక్కడే నివాసం ఉంటున్నారు. నారపురెడ్డిపల్లి, కువైట్ కాలనీ, లక్ష్మీనగర్, ఎర్రబల్లి, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ, శారద పాఠశాల వెనుక భాగంలో ఉన్న ప్రాంతాల్లో కనీసం సీసీ రోడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఇక్కడ కొంతమంది రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు.

● ఎర్రబల్లి ప్రాంతంలో డ్రైనేజీ కాలువ సక్రమంగా లేకపోవడంతో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ ప్రాంతాల్లో వర్షం పడినప్పుడు వాననీరంతా ఇళ్ల వద్దనే రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. అధికారులు మాత్రం పన్నుల వసూళ్లకు వస్తున్నారే తప్ప అభివృద్ధి పనులు చేయడంతో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

బాల్యవివాహాలతో భవితకు చేటు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ హేమసుందర్‌రావు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో విద్యార్థినుల భవిష్యత్తు దెబ్బతింటుందని సీఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. చిన్నతనంలో వివాహం చేసుకోవడం, చదువును మధ్యలో వదిలేయడం వల్ల తలెత్తే పరిణామాలను వివరించారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు, ఆపద సమయంలో ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశాలపై సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామర్థ్యాలు మెరుగుపడాలి

పుల్లంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మెరుగుపడాలని ఎంఈవో చక్రధర్‌రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు గణితంలో వెనుకబడి ఉన్నారని వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో చక్రధర్‌రాజు